



క్రీడాజ్యోతిని వెలిగించిన కలెక్టర్ డాక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో

సమస్యల పరిష్కారం

- నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వికె.సరస్వత్ - ఘనంగా ట్రిపుల్ ఐటి డిఎం స్నాతకోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వికె.సరస్వత్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టు సమీపంలో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్ ఐటి డిఎం) 6వ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాసంస్థ డైరెక్టర్ బిఎస్.మూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వికె.సరస్వత్, ట్రిపుల్‌టి డిఎం వ్యవస్థాపక డైరెక్టర్ సోమయాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వికె.సరస్వత్ మాట్లాడారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సవరణ చట్టం, 2017 ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ హోదాను మంజూరు చేసిందని తెలిపారు. అధ్యాపకులు పరిశోధనలను కొత్త పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. సమాజంలోని ప్రస్తుత సవాళ్లకు ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలు సమాధానాలు కనుగొనవని తెలిపారు. విద్యార్థులు ఏ వృత్తిని ఎంచుకున్నా అందులో నిజాయితీ, చిత్తశుద్ధి, విధేయతను కాపాడుకోవాలని సూచించారు. నానోటెక్నాలజీ, డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ మన జీవితాన్ని మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే సైన్స్, పరిశోధనలు భారతదేశంలో తక్కువ ఖర్చులో అందు బాటులో ఉన్నాయన్నారు. గ్రామీణ సమస్యలను పరిష్కరించ డానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వేషించాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు సూచించారు. తద్వారా పట్టణ వల సలను నియంత్రించవచ్చని తెలిపారు. ఇన్నోవేషన్, నాలెడ్జ్ జనరేషన్, ట్రాన్స్‌ఫర్మేషన్ తర్వాతి తరానికి కీలక మంత్రం అవుతుందన్నారు. డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, నాయకులు తదితర రూపాల్లో యువత దేశానికి మూలస్తంభాలుగా నిలుస్తారని తెలిపారు. లక్ష్యం నుంచి పారిపోకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ప్రధాని కలల వికసిత్ భారత్-2027ను విద్యార్థులు, యువత మాత్రమే నిర్మించగలదన్నారు. డైరెక్టర్ బిఎస్.మూర్తి మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ రూపంలో దేశావృద్ధికి నిరంతరం తోడ్పడుతోందని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా ఉండాలని సూచించారు. అవుట్‌గోయింగ్ విద్యార్థులు క్యాంపస్‌కు అంబాసిడర్‌లుగా ఉండాలని ఆ కాంక్షించారు. సిఎస్‌ఇ, మెకానికల్ ఇంజినీరింగ్, వివిధ శాఖల నుంచి 143మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొందారు. ఐదుగురు విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు. తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఎన్‌ఐటి రాయ్‌పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమణారావు. ట్రిపుల్ ఐటి డిఎం కర్నూలు రిజిస్ట్రార్ గురుమూర్తి, సెనేటర్లు, డీన్లు, ఇనిస్టిట్యూట్ హెడ్స్ పాల్గొన్నారు.



బంగారు పతకాలు అందుకుంటున్న విద్యార్థులు



కాంతులీనిన క్రీడా జ్యోతులు

- ఘనంగా ఒలింపిక్ దినోత్సవ వేడుకలు
- క్రీడా స్ఫూర్తితో పరుగు తీసిన క్రీడాకారులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్రీడాకాంతులతో శనివారం కర్నూలు నగర కూడళ్లలో క్రీడా జ్యోతులు దేదీప్యమానంగా వెలిగాయి. కర్నూలు నగరంలో ఒలింపిక్ దినోత్సవాన్ని క్రీడలోకం ఘనంగా నిర్వహించింది. జిల్లా ఒలింపిక్ సంఘం, జిల్లా క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఒలింపిక్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతోపాటు ఎస్పీ జి.కృష్ణకాంత్, ఒలింపిక్ ఛైర్మన్ కెఇ.ప్రభాకర్, డాక్టర్ పి.సుధాకర్‌రావు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు కెఇ.జగదీష్ కుమార్, కెవి.సుబ్బారెడ్డి, క్రెడాయ్ ప్రతినిధులు సాయిరామ్ రెడ్డి హాజరయ్యారు. కర్నూలులోని ఆర్ఎస్ రోడ్డు కూడలి నుంచి కర్నూలు స్టేడియం, వన్ టౌన్ పోలీసు స్టేషన్, చెన్నమ్మ సర్కిల్, ఖానా ఖజానా, ఎపిఎస్‌పి బెటాలియన్ కూడలి నుంచి క్రీడా జ్యోతులను విద్యార్థులు, క్రీడాకారులు, క్రీడాసంఘం ప్రతినిధులు, విద్యాసంస్థల అధినేతలు, నాయకులు చేతపట్టుకుని నగర వీధుల గుండా పరుగు తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడారు. నిత్యం సాధన చేయడం ద్వారా క్రీడల్లో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని, జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలిపారు. చిన్నారులకు ఆటలు ముద్దు.. సెల్‌ఫోన్ వద్దు అనే నినాదం ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సమాజంలో క్రీడాకారులకు ఉన్న గుర్తింపు ఎవరికీ ఉండదని తెలిపారు. అనంతరం కెఇ.ప్రభాకర్ మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే క్రీడలను సాధన చేయాలని, తప్పకుండా మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. క్రీడలకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. ఒలింపిక్ సంఘం అధ్యక్షులు జగదీశ్ కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శి పి.సునీల్ కుమార్, ఒలింపిక్ ఉపాధ్యక్షులు గంగాధర్ గౌడ్, కబడ్డీ రాజశేఖర్, శుభాకర్, డాక్టర్ శంకర్ శర్మ, శమంతకమణి, జిల్లా క్రీడల అధికారి భూపతి రావు, ఒలింపిక్ సంఘం కోశాధికారి శ్రీధర్, నాగేంద్రుడు, జిల్లా స్కేటింగ్ అధ్యక్షులు సుధాకర్ గౌడ్, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు, గ్రీన్ కో సంస్థ సభ్యులు ఎన్.శ్రీనివాసులు నాయుడు, డాక్టర్ రవి, వెటరన్ క్రీడా సంఘం సభ్యులు వాసు, పాండు రంగా రెడ్డి, పిఇటి సంఘం అధ్యక్షుడు జోసెఫ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను

బలోపేతం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలోని ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్,నవీన్ పాటి రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రవికుమార్,నవీన్, జయరాజు, కర్నూలు మండల అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ సోమన్నలతో పాటు పలువురు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒకటి రెండు తరగతులు మాత్రమే ప్రాథమిక పాఠశాలలని, మిగతావన్నీ హైస్కూల్లో మెర్జ్ చేయడం దానివలన నిరుపేద విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. జిఒ నెంబర్ 117ను రద్దు చేయాలన్నారు. ప్రతిప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5 తరగతులు ఉండేలా చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేటట్లు చేయాలని, ఖాళీగా ఉన్న 25వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేసి ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకలు, రామచంద్రుడు, శేషఫని, హనుమన్న, కిరణ్, శౌకత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొక్కుబడిగా..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన మొక్కుబడిగా సాగింది. రెండు రోజుల పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరువు బృందం సభ్యులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండేచర్ డైరెక్టర్ చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్, తాగు నీరు, పారిశుధ్య శాఖ డిప్యూటీ అడ్వయిజర్ ఆషిస్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద కుమార్ సోని పర్యటించారు. తొలి రోజు కర్నూలు జిల్లాలోని ఆలూరు, కోడుమూరు మండలాల్లో కార్యాలయాల్లో ఫొటో ఎగ్జిబిషన్లను తిలకించడం, రైతులు చెప్పింది వినడం వరకే పరిమితం అయ్యారు. ఆలూరు, కోడుమూరులో రబీకి సంబంధించి దెబ్బతిన్న శనగ, జొన్న తదితర పంటలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. రెండో రోజు నంద్యాల జిల్లాలోని కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాల్లో కరువు బృందం సభ్యులు పర్యటించారు. ఆయా కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నంద్యాల జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల గురించి క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని కరువు బృందం సభ్యులు తెలిపారు. అంతకుముందు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కరువు పరిస్థితుల అధ్యయనంపై కేంద్ర కరువు బృందం వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీ నష్టం వాటిల్లిన ఆరు నెలల తర్వాత కరువు బృందం పర్యటించడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు పరిశీలించడానికి నష్టపోయిన పొలాలు లేవని, ఏం చూసి నష్టాన్ని అంచనా వేస్తారని ప్రశ్నిస్తున్నారు.

సాగుకు సన్నద్ధం : తొలకరి వర్షాలు కురవడంతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ముందు జాగ్రత్తగా వ్యవసాయ శాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లాలో కురిసిన వానలతో అన్నదాతలు భూములు చదును చేయడంలో నిమగ్నం అయ్యారు. ఖరీఫ్ సాగు గతేడాది కంటే ఈసారి ఇంకా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు విత్తనాలు, ఎరువులు ఏ మేరకు అవసరమవుతాయనేది అధికారులు కార్యాచరణ రూపొందించారు. పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేవిధంగా వ్యవసాయాధికారులు చర్యలు ప్రారంభించారు. ఈసారి ఖరీఫ్ సాగుకు ప్రధాన పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఏ పంట విత్తనాలు ఎంత మేర అవసరమవుతాయనేది అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. అందుకు సంబంధించి ఇప్పటికే అన్ని సిద్ధం చేశారు. పంటల సాగులో ఎంతో ముఖ్యమైన ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులు అధికారులు ఇచ్చే సూచనలు, వాడాల్సిన కంటే ఎక్కువగా ఎరువులు వాడడంతో అదనంగా ఎరువులు తెప్పించాల్సి వస్తుందని అధికారులు అంటున్నారు.

చినుకు పడితే చిత్తడే : కర్నూలు, నంద్యాల రెండు జిల్లాలు కలిపి 3,621.408 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. వాటిలో 3,248 కిలో మీటర్ల బిటి రోడ్లు, 258.13 కిలోమీటర్ల సిసి రోడ్లు, 7.7 కిలోమీటర్ల మెటల్ రోడ్లు, 107.05 కిలో మీటర్ల అన్ మెటల్ రోడ్లు ఉన్నాయి. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల సగానికి పైగా రోడ్లన్నీ రాళ్లు తేలడం, బురదమయంగా మారడంతో ఆయాదారుల గుండా ప్రయాణం చేసేందుకు వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. తరచూ పాడయిన రోడ్లల్లో ప్రయాణించడం వల్ల వాహనదారులు వెన్ను, మెడ సంబంధ రోగాల భారిన పడుతున్నారు. కర్నూలు నగరంలోని రహదారులకూ అదే దుస్థితి దాపురించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన బీసీ జనార్ధన్ రెడ్డికే రోడ్లు, భవనాల శాఖ కేటాయించడంతో జిల్లాలో రోడ్ల పరిస్థితి మారుతుందేమే అని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

భగ్గుమంటున్న కూరగాయలు : కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల రేట్లు చుక్కల్లో చేరాయి. టమోట కిలో ఏకంగా రూ.వందకు చేరింది. వర్షాకాలం ప్రారంభంకావడంతో పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అన్నిరకాల ధరలకు రెక్కలొచ్చాయి. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.150పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.డిమాండుకు సరిపడా సరఫరా లేకపోవడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు.






నన్నూరులో తాగునీటికోసం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న బాధితులు

నన్నూరులో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నన్నూరు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని శనివారం సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెళతో నిరసన తెలిపారు. సిపిఎం మండల నాయకులు ఎస్ మధుసూదన్, స్థానిక నాయకులు మాసుం బాష, రాము, స్థానికులతో కలిసి నన్నూరు గ్రామం 6వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడున్న స్థానిక మహిళలు 3 నెలలుగా ఈ కాలనీకి తాగునీళ్లు రావడంలేదని విన్నవించారు. ఎండాకాలం ముగిసినా 6 వ వార్డులో మూడు నెలలుగా మంచినీళ్లు రాకపోవడం దురదృష్టకరమని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ఒకటి రెండు కిలోమీటర్ల దూరంలో స్థానిక మహిళలు ప్రజలు పనులు మానుకొని మంచినీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామపంచాయతీ అధికారులు 6వ వార్డు మంచినీటి సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు , మండల అధికారులు తక్షణమే నన్నూరు ఆరవ వార్డు కాలనీ సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. రామాంజనేయులు , మహిళలు రామేశ్వరి, లక్ష్మీదేవి, సావిత్రమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు నారాయణ విద్యార్థి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఒలిపింక్ డే రన్ 2024 సందర్భంగా స్థానిక కర్నూలు స్టేడియం అసోసియేషన్ మైదానంలో నిర్వహించిన కరాటే పోటీలలో నారాయణ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్ తెలిపారు. కరాటే పోటీలలో బంగారు పతకం సాధించిన విద్యార్థికి స్థానిక మధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ 40 కేజీల అండర్- 14 విభాగంలో కరాటే పోటీలలో 7వ తరగతి చదువుతున్న విశ్వేష్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారని అన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి అసోసియేషన్ మీట్ నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచి జులై 21న జరిగే జాతీయ స్థాయి పోలీలకు ఎంపికయారని తెలిపారు. కార్యక్రమంలో ఎడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తికొండలో ప్రబలిన అతిసార

పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కుబడిగా వైద్యం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మండలంలో అతిసార ప్రబతులుతుంది.ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కలుషిత నీటితో రోగాల బారిన పడి ఇబ్బందులు తప్పడం లేదని రోగులు పేర్కొంటున్నారు. పత్తికొండ మండలం పత్తికొండ ,హోసూరు చిన్నహుల్తి, పెద్దహుల్తి , మండగిరి, జూటూరు, దూదేకొండ జయం తండా చక్రాల పందికోన, కోతిరాళ్ల, కొత్తపల్లి తదితర గ్రామాలలో కలుషిత నీరు వల్ల వాంతులు విరోచనాలు జ్వరంతో ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజుల్లో పత్తికొండ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో 160 మంది అతిసార రోగులకు చికిత్స అందించినట్లు డాక్టర్లు వెల్లడించారు. గ్రామాలలో ప్రభుత్వ ఆసుపత్రిలు లేక ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వాంతులు, విరోచనాలు, జ్వరం వచ్చిన రోగులకు సెలైన్ బాటిల్‌పెట్టి మాత్రలు ఇచ్చి ఇంటికి పంపిస్తున్నారు. తూతూ మంత్రంగా చికిత్స అందిస్తున్నారని రోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులకు ఎలాంటి సూచనలు, సలహాలు ఇవ్వడం లేదంటున్నారు.

పేరుకే 50 పడకల ఆసుపత్రి

పత్తికొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకల ఆసుపత్రిగా ప్రారంభించారు. ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది ఉన్నా రోగులకు చికిత్స పూర్తిస్థాయిలో అందడం లేదని రోగులు పేర్కొంటున్నారు. డాక్టర్లు సమయపాలన పాటించడం లేదని రోగస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యధోరణితో ఉన్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



పత్తికొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్

పట్టించుకోని పంచాయతీ సెక్రటరీలు

పత్తికొండ మండలంలో 17 గ్రామాలలో చెత్తాచెదారం, డ్రెయినేజీలు నిండి అస్తవ్యస్తంగా మారింది. పారిశుధ్య పనులను పట్టించుకోవడం లేదు. ఎక్కడపడితే అక్కడ మురుగు నీరు చేరి దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుళాయిల్లో కలుషిత నీరు రావడం వల్ల రోగాల భారిన పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో కుళాయిల ద్వారా వచ్చే నీరు తాగడానికి ఇబ్బందిగా ఉందని ప్రజలు అంటున్నారు. మినరల్ వాటర్ కొనలేక గత్యంతరం లేక కొళాయి నీరు తాగుతున్నామని అంటున్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలకు రోగులు క్యూ..

వాంతులు విరోచనాల, జ్వరంతో రోగులు ప్రవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆర్ఎంపి డాక్టర్లు తమకు నచ్చిన రీతిలో రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆర్ఎంపి డాక్టర్లు, మెడికల్ స్టోర్ యాజమాన్యాలు రోగులను ఆసరా చేసుకొని మూడు పూలు ఆరుకాయలుగా దండుకుంటున్నారు.

నామమాత్రపు చికిత్స

నిహారిక, పత్తికొండ పట్టణం 15వ వార్డు..

పత్తి కొండ పట్టణం లోని 15వ వార్డుకు చెందిన నిహారికకు రెండు రోజుల నుండి వాంతులు, విరోచనాలతో జ్వరం వస్తుంది. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో నామమాత్రపు చికిత్స అందించారని ఆమె బంధువులు పేర్కొన్నారు. మాత్రలు ఇచ్చి ఇంటికి పంపించారు.



గోరువెచ్చని నీరు తీసుకోవాలి

డాక్టర్ కల్పన, గైనకాలజిస్ట్,పత్తికొండ



వాంతులు విరోచనాలు జ్వరం లక్షణాలు ఉన్న వెంటనే రోగులు గోరువెచ్చని నీరు తీసుకోవాలి. చిన్నపిల్లలు, వృద్ధులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లను సంప్రదించాలి.

నీటి పరీక్షలు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డయేరియా వ్యాధి ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వైద్యాధికారులు, సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. తరచూ ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులు నీటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాలులో డయేరియా నివారణలో (స్టాప్ డయేరియా క్యాంపెయిన్) భాగంగా వైద్యాధికారులు, సంబంధిత శాఖ అధికారులతో జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు డయేరియాకు సంబంధించిన ఎటువంటి కేసులు నమోదు కానప్పటికీ మే మొదటి వారం నుంచి వర్షాలు పడుతున్నందున, వర్షాల వల్ల డయేరియా, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. డయేరియాతో పాటు డెంగ్యూ, మలేరియా సోకిన వ్యక్తులకు అవసరమైన వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియా వ్యాప్తి చెందినప్పుడు మాత్రమే వైద్య సిబ్బంది వైద్య సహాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. అలా ప్రతి మండలంలో కూడా డయేరియా నివారణకు గాను సంబంధిత శాఖల సిబ్బందిని నియమించలన్నారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ ప్రవీణ్ కుమార్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, అదనపు డిఎంహెచ్‌ఒ భాస్కర్, డిఇఒ శామ్యూల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ నాగేశ్వరరావు, ఐసిడిఎస్, బిసి సంక్షేమ అధికారి పిడి వెంకటలక్ష్మి, డిపిఒ నాగరాజు నాయుడు, మలేరియా అధికారి నూకరాజు, డిసిహెచ్ఎస్ మాధవి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి, డెమో ప్రమీలాదేవి, హెచ్ఇఒ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





నూతన కలెక్టర్‌గా రంజిత్ బాషా

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ గా డాక్టర్ జి.సృజన బదిలీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా నూతన కలెక్టర్‌గా పి రంజిత్ బాషా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ఉన్న పి రంజిత్ బాషాను కర్నూలు జిల్లా కలెక్టరుగా బదిలీ చేశారు. కర్నూలు జిల్లా కలెక్టర్‌గా ఉన్న గుమ్మళ్ల సృజనను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరుగా బదిలీ చేశారు.

గ్రామాలలో ఏరువాక పున్నమి వేడుకలు

ప్రజాశక్తి-తుగ్గలి

మండలం పరిధిలోని వివిధ గ్రామాలలో రైతులు శనివారం ఏరువాక పున్నమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రైతులు తమ ఎద్దులను వివిధ రంగులతో అలంకరించడంతోపాటు, గాడిపాటులను కూడా రంగులతో అలంకరించారు. ఈ సందర్భంగా రైతులు ఎద్దులకు, గాడిపాటులకు పూజలు చేశారు. గ్రామ చివరన ఎద్దుల పరుగుపందెం పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలైన వృషభాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.



డిజిపిని కలిసిన కర్నూలు ఎంపి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమల రావును కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిసారు. మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో ఆయనను కలిసి ఎంపి పుష్పగుచ్ఛం అందజేశారు.. ఈ సందర్భంగా ఎంపి నాగరాజు జిల్లాలో నేరాలపై డిజిపి తిరుమలరావు తో చర్చించారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



విద్యలో రాణిస్తేనే సమాజంలో గౌరవం

- ప్రధానోపాధ్యాయులు పెద్ద నాగన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

చదువుకునే ప్రతి విద్యార్థి కూడా మంచి మార్కులతో విజయం సాధిస్తేనే సమాజంలో ఒక గౌరవం, ఆ విద్యార్థి విలువ పెరుగుతుందని, అది గ్రహించి చదువులో రాణించాలని ప్రధానోపాధ్యాయులు పెద్ద నాగన్న సూచించారు. శనివారం నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పెద్దనాగన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పుస్తకాలను, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటివరకు దాదాపు 98 శాతం పుస్తకాల కిట్లను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా వసతులు లేవన్న భావన తల్లిదండ్రుల మదిలో నుంచి తీసివేయాలని కోరారు. ప్రస్తుతం ప్రయివేట్ పాఠశాలల్లో పెరుగుతున్న స్కూల్ ఫీజులను చెల్లించుకోలేక పేద తల్లిదండ్రులు బిడ్డలను చదువుకు దూరం చేసే ప్రమాదం ఉందన్నారు. ఏ ఒక్కరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులూ కల్పించి మంచి భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు భీమలింగప్ప, సోమలింగప్ప, యాసిన్ బాష, వాణి, పరిమళ, శివలింగప్ప పాల్గొన్నారు.

పంటల మార్పిడి తప్పనిసరి

- ఎఒ వెంకటేశ్వర గౌడ్

ప్రజాశక్తి - ఆలూరు

రైతులు పంటల మార్పిడి తప్పనిసరిగా పాటించాలని ఎఒ వెంకటేశ్వర గౌడ్ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు ప్రతేడాది ఒకే రకం పంట సాగు చేయడం వల్ల నష్టం జరుగుతుందని తెలిపారు. పంట మార్పిడితో దిగుబడి గణనీయంగా పెరిగి లాభం వస్తుందని చెప్పారు. ఎరువుల దుకాణాల్లో క్రిమిసంహారక మందులు, ఎరువులను రైతులకు ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలను అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో స్టాండ్ ఏర్పాటుకు సహకరించండి

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం వద్ద ఆటో స్టాండ్ ఏర్పాటుకు సహకరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య కోరారు. శనివారం ఆటో యూనియన్ నాయకులు వీరారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆటో కార్మికులు అప్పులు చేసి ఆటోలు తెచ్చుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా, దేవస్థానానికి వచ్చే భక్తులకు సహకరించి ఆటోలు నడుపుకోవాలని సూచించారు. ఈ మధ్యకాలంలో ఆటో కార్మికులపై ఆర్‌టిఒ ఇబ్బందులు, పోలీసుల ఇబ్బందులు అధికమయ్యాయని తెలిపారు. చలానాల రూపంలో జరిమానాలు వేసి ఇబ్బందులకు గురి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఉరుకుంద దేవస్థానంలో ఆటో స్టాండ్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని దేవస్థానం డిప్యూటీ కమిషనర్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. సురేంద్ర, వీరారెడ్డి, నరసింహులు, బీరప్ప, ఈరప్ప, ఉరుకుంద, కామవరం, ఎరిగేరి, చిరుతపల్లికి చెందిన ఆటో కార్మికులు పాల్గొన్నారు.



ఉరుకుంద డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గ్రామ గ్రామాన సంఘాన్ని నిర్మిద్దాం

- దళితుల సమస్యల పరిష్కారానికి కృషి - కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - నందవరం

గ్రామ గ్రామాన కెవిపిఎస్‌ను నిర్మించాలని, దళితుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు కోరారు. శనివారం నందవరంలోని అంబేద్కర్ భవన ప్రహరీలో కెవిపిఎస్ సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు సుమాల ఆంథోని అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవసహాయం, ఆనంద్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మామిడికాయల రాజు మాట్లాడారు. దళితుల సమస్యల పరిష్కారం పట్ల పాలకవర్గాలు దృష్టి పెట్టాలంటే అణగారిన సామాజిక తరగతుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంచాలని తెలిపారు. దేశవ్యాప్తంగా దళితులపై దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యంగా మారాయని చెప్పారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు సైతం ఒక్కొక్కటిగా ధ్వంసం అవుతున్నాయన్నారు. సబ్ ప్లాన్ చట్టం ఉన్నా నిధులు ఏమవుతున్నాయో తెలియదని అన్నారు. బతుకు భద్రత కల్పించే అట్రాసిటీ చట్టం ప్రకారం అరెస్టు అయినా స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని తెలిపారు. దళిత వృత్తులు నేటికీ అంటరానితనాన్ని భరిస్తూనే బతుకుతున్నాయని చెప్పారు. నాయకులు నాగప్ప, రాజన్న, జయరాజు, చిన్నరాజు, బొజ్జన్న, డేవిడ్, సురేంద్ర, తిమోతి, సుందర్ రాజు, నాగరాజు, షడ్రక్‌తో పాటు మరో 30 మంది పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

- డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మెగా డీఎస్సీని 25 వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మిగనూరు డివైఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. డివైఎఫ్ఐ పట్టణ నాయకులు రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడారు. రాష్ట్రంలో 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిఒ 117ను రద్దు చేయాలని అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఉద్యోగుల విరమణ వయస్సు 58కి తగ్గించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.36 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.8 వేలు ఇవ్వాలని కోరారు డివైఎఫ్ఐ నాయకులు అజిత్, హనుమంతు, వినోద్ కుమార్, నాని, వినోద్, అఖిల్, మహేష్, కృష్ణ, భీమేష్, చిన్న, గణేష్, రాజేష్, గురు, రమేష్, వీరేష్ పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ వీరేష్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పోలీసు కానిస్టేబుల్ వీరేష్ అనాథ వృద్ధుని ఆశ్రమంలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రస్తుత తీరిక లేని జీవితంలో రోడ్డు పక్కన ఎవరైనా పడి ఉంటే చూసీచూడనట్టు వ్యవహరిస్తారు. చూసిన వెంటనే స్పందించిన కానిస్టేబుల్ వీరేష్‌ను ప్రజలు అభినందిస్తున్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో దీనస్థితిలో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన అనాథ వృద్ధుని ప్రభుత్వాస్పత్రికి డ్యూటీపై వెళ్లిన పోలీసు కానిస్టేబుల్ వీరేష్ చూసి మానవత్వం చాటుకున్నారు. వారం రోజుల నుంచి ప్రభుత్వాస్పత్రి ఎదురుగా దీనస్థితిలో పడి ఉన్న వృద్ధుని చూసి చలించిన కానిస్టేబుల్ వీరేష్ తల స్నానం చేయించి, వైద్య పరీక్షలు చేయించారు. శనివారం ఒక ఆటోలో ఆదోనిలోని జీవన్ జ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధుని ఆరోగ్య పరీక్షల నిమిత్తం రూ.10 వేలు విరాళంగా ఇచ్చి ఆ వృద్ధుని ఆశ్రమంలో చేర్పించారు.



వృద్ధుని అనాథాశ్రమంలో చేరుస్తున్న కానిస్టేబుల్ వీరేష్

అనారోగ్యంతో వైసిపి సీనియర్ నాయకుడు

అత్రి తనయ గౌడ్ మృతి

- జననేతకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - కౌతాళం

వైసిపి సీనియర్ నాయకులు బిఆర్.అత్రి తనయ గౌడ్ (60) అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని బదినేహాల్ గ్రామానికి చెందిన కీర్తిశేషులు, ఆదోని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బిఆర్.దత్తాత్రేగౌడ్ మూడో కుమారుడు అత్రి తనయ గౌడ్. ఈయన మృతి చెందడంతో బదినేహాల్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు, గ్రామస్తుల మధ్య అంత్యక్రియలు శనివారం జరిగాయి. జననేతకు కన్నీటి వీడ్కోలు పలికారు. రాజకీయరంగంలో అత్రి తనయ గౌడ్ జననేతగా పేరు గాంచారు. బదినేహాల్ గ్రామ సహకార సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్నారు. అప్పటి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి, అనంతరం కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, వైఎస్.రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన నాయకుల్లో ఈయన ఒకరు. ఇప్పటి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో అత్రి తనయ గౌడ్ కూడా కలిసి నడిచారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గెలుపు కోసం కౌతాళం మండలంలో కీలక నాయకులుగా పేరుగాంచారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధి కోసం ఆయన సేవలు అందించారు.



అత్రి తనయ గౌడ్ మృతి (ఫైల్)

ప్రముఖులు ఘన నివాళి

వైసిపి సీనియర్ నాయకులు అత్రి తనయ గౌడ్ మృతి చెందడం పట్ల రాజకీయాలకు అతీతంగా ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మధుసూదన్, వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, జనసేన ఆదోని ఇన్‌ఛార్జీ మల్లప్ప, వైసిపి మండల నాయకులు దాట్ల కృష్ణంరాజు, వీరసేనారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దేశాయి ప్రహ్లాద చారి, విరుపాక్షిరెడ్డి, లక్ష్మిరెడ్డి, వాసురెడ్డి, రవీంద్రరెడ్డి, హనుమంతురెడ్డి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ నెంబర్ మాబు సాబ్, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజు గౌడ్, రామన్న గౌడ్, ఏకం రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, సర్పంచి పాల్ దినకరన్, ఆయా గ్రామాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి మంత్రాలయం యువ నాయకులు దివాకర్ రెడ్డి, టిడిపి మండల నాయకులు చెన్నబసప్ప, అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, టిప్పు సుల్తాన్, రమేష్ గౌడ్ ఆయా గ్రామాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అత్రి గౌడ్ మృతి పార్టీకి తీరని లోటు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

వైసిపి సీనియర్ నాయకులు అత్రి తనయ గౌడ్ మృతి పార్టీకి తీరని లోటని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విజయవాడ నుంచి కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన మృతి పట్ల బాధను వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడు అత్రి గౌడ్ అని, అలాంటి వ్యక్తి కోల్పోవడం పార్టీకి తీరని నష్టమని పేర్కొన్నారు.





పవన్ కల్యాణ్‌ను కలిసిన రేఖాగౌడ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను జనసేన పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రేఖగౌడ్ శనివారం కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎమ్మిగనూరులో అధికంగా అన్ని వర్గాల ప్రజలు చేనేత రంగాన్ని నమ్ముకున్నారని తెలిపారు. చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని చాలా గ్రామాల్లో దశాబ్దాలుగా నెలకొన్న తాగు, సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలిపారు. సానుకూలంగా స్పందించిన పవన్ మాట్లాడుతూ... ఎంతో నమ్మకంతో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని భారీ విజయంతో గెలిపించారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారం కోసం పనిచేస్తే తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారని రేఖాగౌడ్ తెలిపారు. అలాగే జిల్లాల వారీగా జనసేన అధ్యక్షులు త్వరలోనే కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తారని చెప్పినట్లు పేర్కొన్నారు. మొదటగా రాయలసీమ జిల్లాల నుంచే సమావేశాలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గ జనసేన నాయకులు, క్రియాశీలక కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించే వరకు పార్టీ కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అండగా నిలబడాలని తెలిపినట్లు పేర్కొన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతి జన సైనికుడికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొనట్లు తెలిపారు.

ఎల్లమ్మ పేటలో తాగునీటి సమస్య పరిష్కారం

- చేతిపంపు బోరుకు మరమ్మతులు చేయించిన వార్డు సభ్యులు వడ్డే మాదన్న

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలోని ఎల్లమ్మ పేట వీధిలో నెలకొన్న తాగునీటి సమస్యకు 2వ వార్డు సభ్యులు మాదన్న శనివారం పరిష్కారం చూపారు. ఎల్లమ్మ పేట వీధిలో గత కొన్ని నెలలుగా చేతిపంపు బోరు పని చేయడం లేదు. కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపి 2వ వార్డు సభ్యులు మాదన్న చేతిపంపు బోరు మరమ్మతులు చేయించారు. నూతన పైపులు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. పేటలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



మరమ్మతులు చేయిస్తున్న మాదన్న

పోరాట ధీరుడు అయ్యన్నపాత్రుడు

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని



ప్రజా సమస్యలపై నిరంతరంగా పోరాడిన ధీరుడు అయ్యన్న పాత్రుడని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శనివారం అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన సందర్భంగా ఆదోనిలో ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ విలేకరులతో ఆమె మాట్లాడారు. అయ్యన్నపాత్రుడు 25 ఏళ్ల వయస్సులో మంత్రిగా ఎన్నికయ్యారన్నారు. 16 ఏళ్లు మంత్రిగా పని చేసిన అనుభవం ఆయనకుందని తెలిపారు. ఒకే పార్టీ, ఒకే జెండా ప్రజల అజెండాగా ముందుకెళ్లిన నాయకుడు అయ్యన్నపాత్రుడని ప్రశంసించారు.

తాగు, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించండి

- మంత్రి రామానాయుడుకు ఎమ్మెల్యే పార్థసారథి వినతి

ప్రజాశక్తి - ఆదోని



అంత్యంత వెనుకబడిన రాయసీమలో తాగు, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. శనివారం అసెంబ్లీ సమావేశాల అనంతరం నీటి పారుదల శాఖ మంత్రి రామానాయుడుకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన ఫోన్ ద్వారా విలేకరులకు తెలిపారు. రైతులు, ప్రజలు నీరులేక తల్లడిల్లుతున్నారన్నారు. వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్, హంద్రీనీవా కాలువ వెడల్పు చేయించాలని కోరామని తెలిపారు. రాయలసీమ ప్రజల ఆశ, ఆకాంక్ష, చిరకాల స్వప్నం నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టి పనులు ప్రారంభించాలని కోరారు.

ఏరువాక పున్నమి ఉత్సవాలను

ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఏరువాక పున్నమి ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలని రైతుసంఘం నాయకులు కోరారు. శనివారం మండలంలోని కె.తిమ్మాపురం గ్రామ పొలాల్లో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ఏరువాక పున్నమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి బిటి.చిన్నన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన గౌడ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, సర్పంచి బిజి.మహేశ్వరి పాల్గొని రైతులతో కలిసి ఎద్దులను అలంకరించి, భూమి పూజ చేసి విత్తనం, గొర్రు కట్టి పంట సాగు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు రైతులు ఉత్సాహంగా ఎద్దులతో నాగళ్లు, మడకలు, గొర్రు, గుంటకలతో వ్యవసాయ సాగును ప్రారంభించడం శుభ పరిణామని తెలిపారు. వ్యవసాయ రంగంలో వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు వేసిన పంటలు మంచి దిగుబడులు రావాలని, పండిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు, కౌలు రైతులకు నూతన వ్యవసాయ కోతల నూర్పిడి యంత్రాలు, మైక్రో ఇరిగేషన్ పరికరాలు 75 శాతం రాయితీతో ఇవ్వాలని కోరారు. రైతులకు వడ్డీ లేకుండా రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టి, రైతు భరోసా కేంద్రాల ద్వారా 90 శాతం సబ్సిడీతో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న, రైతు సంఘం నాయకులు బిజి.విరుపాక్షి నాయుడు, మల్లికార్జున గౌడ్, రామలింగన్న, కృష్ణ, మాదన్న, సత్తన్న, రామచంద్రప్ప గౌడ్, గోరంట్ల యోహాన్, శంకరన్న పాల్గొన్నారు.

కోసిగి : ఏరువాక పున్నమి పండగ అంటేనే ఎద్దుల పండగగా గ్రామీణ ప్రాంత ప్రజలు భావిస్తారు. అందుకే తమ ఇంటిలోని పశువులన్నింటినీ శుభ్రంగా కడిగి వాటికి రంగులను వేసి అందంగా ముస్తాబు చేస్తారు. శనివారం మండలంలోని ఆర్లబండ, అగసనూరు, కమనదొడ్డి, వందగల్లు, జంపాపురం, సజ్జలగూడెం తదితర గ్రామాల్లోని రైతులు ఏరువాక పున్నమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని రైతులు పశువులను అందంగా ముస్తాబు చేసి గ్రామచావిడి నుంచి గ్రామంలోని అన్ని కూడళ్లలో ఊరేగించారు. రైతులు జోరుగా పంటలను సాగు చేయడానికి పొలాల బాట పట్టారు. ఏరువాక పున్నమి వేడుకలు పల్లెల్లో అంబరాన్నంటాయి. రైతుల పండగ ఏరువాక పున్నమిని మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రైతులు వ్యవసాయ పనుల్లో తమకు చేదోడువాదోడుగా ఉంటున్న ఎద్దులకు రంగులద్ది, అలంకరణలతో సింగారించి వాటికి పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మిగనూరు రూరల్ : బనవాసి గ్రామంలో ఏరువాక పున్నమి సంబరాలు ఘనంగా సాగాయి. టిడిపి మండల ఉపాధ్యక్షులు కురువ అయ్యాలప్ప, టిడిపి గ్రామ అధ్యక్షులు అశోక్ కుమార్, కురువ నరసింహులు ఆధ్వర్యంలో బనవాసి యువకులకు పరుగు పందెం నిర్వహించారు. ఈ పరుగు పందెంలో కురువ బసవరాజు, బోయ మధు, కురువ పుష్పరాజ్‌కు ప్రథమ బహుమతి సైకిల్, ద్వితీయ బహుమతి రూ.1,011, తృతీయ బహుమతి రూ.1,016లను గ్రామీణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి అందజేశారు. టిడిపి బనవాసి గ్రామ యువకులు కె.ధనంజయ, కురువ పరంధామ, శాంత కుమార్, మల్లికార్జున, కురువ ధనుంజయ, కురువ హరి, కురువ కృష్ణ, కురువ వీర నాగప్ప, కురువ శ్రీనివాసులు పాల్గొన్నారు.



పొలం దున్నుతున్న రైతులు, రైతు సంఘం నాయకులు



కోసిగి : ముస్తాబు చేసిన ఎద్దులతో యువకులు



ఎమ్మిగనూరు : బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ

ఎద్దుల పారువేటలో శ్రీమఠం ఎద్దు విజయం

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎద్దుల పారువేటలో శ్రీరాఘవేంద్రస్వామి మఠానికి చెందిన ఎద్దు విజయం సాధించింది. శనివారం ఏరువాక పున్నమి సందర్భంగా స్థానిక సంత మార్కెట్‌లో నిర్వహించిన వృషభాల పరుగు పందెం గ్రామస్తులకు కనువిందు కలిగించింది. సర్పంచి భీమయ్య, ఎస్ఐ గోపినాథ్ ఆధ్వర్యంలో రైతుల ఎద్దులను వరుసగా నిలిపి పోలీసు విజిల్‌తో మూడు సార్లు పారువేట ప్రారంభించగా శ్రీమఠానికి చెందిన ఎద్దు విజయం సాధించింది. గోసంరక్షణ శాల సిబ్బంది కేకలతో హర్షధ్వానాలతో ఆనందం పంచుకున్నారు. అంతకుముందు ఏరువాక పౌర్ణమి పండగ సందర్భంగా గ్రామాల్లోని రైతులు తమ ఎద్దులకు స్నానాలు చేయించి రంగులు వేసి పిండి వంటలతో తమ పొలాల్లో పొలిచల్లి వృషబాలకు తినిపిస్తారు. ఇందులో భాగంగానే కుటుంబ సభ్యులందరూ కొత్త బట్టలు ధరించి సంతోషంగా ఆ రోజంతా గడుపుతారు. ఈ ఉపసర్పంచి హోటల్ పరమేష్ స్వామి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, పూజారి గోపాలకృష్ణ స్వామి, అశోక్ రెడ్డి, వరదరాజులు, హండే అనుమంతు, వట్టెప్ప గారి చిన్న సుంకప్ప, వట్టెప్ప గారి నరసింహ, వనికె నాగరాజు, గనేకంటి రఘు, గనేకంటి రామకృష్ణ, పవన్ కుమార్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కురువ మల్లికార్జున, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పారువేటలో పాల్గొన్న ఎద్దులు

గెలిచిన ఎద్దులకు రూ.2,050 బహుమతి

మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో నిర్వహించిన ఎద్దుల పారువేటలో గెలిచిన ఎద్దుల యజమానికి టిడిపి గ్రామ నాయకులు రూ.2,050 బహుమతిగా ఇచ్చారు. ఏరువాక పౌర్ణమి పండగ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ఎద్దుల పరుగు పందెంలో గ్రామానికి చెందిన పూజారి అల్లింగప్పకు చెందిన ఎద్దులు విజయం సాధించాయి. టిడిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి గ్రూపునకు చెందిన నాయకులు రూ.2,050 బహుమతిగా అందజేశారు.



ఎద్దు యజమానికి బహుమతి అందిస్తున్న టిడిపి నాయకులు

ఇంటిని కూల్చేసిన వారిపై చర్యలు తీసుకోండి

- ఇంటి ముందు బాధితుల నిరసన

ప్రజాశక్తి- దేవనకొండ

ఇంటి ముందు నిరసన చేపడున్న బాధితులు



ఇంటిని కూల్చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. శనివారం బాధితుడు బోయ రామాంజనేయులు, కుటుంబ సభ్యులు ఇంటి ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని జిల్లేడు బుడకల గ్రామంలో దౌర్జన్యంగా తన భార్యను, ఇద్దరు కూతుళ్లను, కుమారుడిని తాళ్లతో కట్టేసి ఇంటిని దౌర్జన్యంగా కూల్చేశారని వాపోయారు. సర్పంచి హనుమంతు కుమారులు కౌలుట్ల, చెన్నకేశవులు, బోయ నాగముని కుమారుడు కాశీమన్న, పురుషోత్తమ రెడ్డి కుమారుడు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో ప్రొక్లెయిన్‌తో ఈ దాడికి పాల్పడ్డారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి గ్రూపునకు చెందిన తమపై వైసిపి గ్రూపునకు చెందినవారు ఈ దాడులకు పాల్పడ్డారని వాపోయారు. పోలీసు శాఖ, పంచాయతీ అధికారుల నిర్లక్ష్య వైఖరితో తన ఇంటిని కూల్చేశారని తెలిపారు. తనకు రూ.20 లక్షల దాకా ఆస్తి నష్టం సంభవించిందని చెప్పారు. టిడిపి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

మిగులు ఉపాధ్యాయులను గుర్తించాలి

- ఎపిఎంటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

నిష్పక్షపాతంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మిగులు ఉపాధ్యాయుల గుర్తింపు, పని సర్దుబాట్లు జరిగేలా చూడాలని ఎపిఎంటిఎఫ్ ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు, ఆర్థిక కార్యదర్శి కోటన్న కోరారు. శనివారం ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పట్టణ అధ్యక్షులు అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వులను పాటిస్తూ పని సర్దుబాటు చేయడం వల్ల అటు ప్రాథమిక పాఠశాలలు, ఇటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను పరిరక్షించుకోవచ్చని తెలిపారు. జిఒ 117, 128లకు విరుద్ధంగా సర్దుబాటు చేస్తే మున్సిపల్ ప్రాథమిక విద్య నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. విద్యా శాఖలో గత సంవత్సరంలో వేలసంఖ్యలో పాఠశాల సహాయకుల పోస్టులు మంజూరు చేసి భర్తీ చేశారని తెలిపారు. 14 సంవత్సరాల నుంచి మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఏ ఒక్క సబ్జెక్టు పోస్టు మంజూరు కాలేదన్నారు. ఆదోనిలో మూడు ఎయిడెడ్ పాఠశాలలు మూతపడడం, విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉన్నత పాఠశాలలు లేకపోవడంతో ఇప్పటికే ఉన్న పురపాలక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది గణనీయంగా పెరిగిందని చెప్పారు. ప్రతి పురపాలక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో ఉన్నాయని తెలిపారు. నాయకులు సురేష్ కుమార్, నూర్ ఉల్ హక్, ప్రతాప్ రెడ్డి, ఆనంద్, రమేష్ రావు, జ్ఞానమద్దయ్య, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు